


రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : ఈనెల 31వ తేదీన నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల నోడల్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి) ఆధ్వర్యాన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ఎన్ఐఐటి–ఐసిఐసిఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్ ఉద్యోగ నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై 19–25 సంవత్సరాల్లోపు వయసు గల స్త్రీ, పురుష అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 10 గంటలకు కళాశాలలోని జెకెసి ల్యాబ్‌లో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8125556674 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

పిల్లలకు ఫోన్ వ్యసనం

మైదానంలో ఆటలాడే చిన్నారుల సంఖ్య తగ్గింది. ఇళ్లల్లో నాలుగు గోడల మధ్య ఆన్‌లైన్‌లో ఆటలాడుతున్న చిన్నారుల సంఖ్య పెరిగిపోతుంది. దీనివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు వైద్యులు చెప్పున్నారు. ఫ్రీ ఫైర్, పబ్జీ వంటి గేమ్స్ వల్ల పిల్లల్లో అగ్రెసివ్ యాటిట్యూడ్ పెరుగుతోందని, ఏ విషయమైనా సున్నితంగా చెప్పేందుకు, చెప్పిన మాట వినేందుకు ఇష్టపడడం లేదని అంటున్నారు. సరిగా నిద్రపోవడం లేదని, నిద్రపోతున్నప్పుడు కూడా ఆ గేమ్స్ ఆడుతున్నట్లు గానే వ్యవహరిస్తున్నారంటూ పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను మానసిక వైద్యుల వద్దకు తీసుకొస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ తరహా కేసులు పెరుగుతున్నాయని, సకాలంలో గుర్తించకపోతే తీవ్ర సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



- చేతికి ఫోన్ ఇస్తే గానీ అన్నం తినని పరిస్థితి
- మరికొందరు నిరంతరం ఆన్‌లైన్ గేమ్స్‌లో తలమునకలు
- చదువుపై దృష్టిసారించకపోవడం, విపరీతమైన కోపం, చెప్పిన మాట వినకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నం
- అశ్రద్ధ చేయొద్దంటున్న వైద్యులు

SUNDAY SPECIAL

ప్రజాశక్తి – శ్రీకాకుళం

ప్రస్తుతం పిల్లల్లో రెండు రకాలైన వ్యసనాలు కనిపిస్తున్నాయి. ఒకటి స్మార్ట్‌ఫోన్, రెండోది ఆన్‌లైన్ గేమింగ్. స్మార్ట్‌ఫోన్ వ్యసనం ఉన్న పిల్లలు ఫోన్ తీసుకుని తమకు నచ్చిన వీడియోలు, బొమ్మలు వంటివి చూస్తున్నారు. ఫోన్ అడిగినప్పుడు ఇవ్వకపోతే ఊరుకోరు. ఫోన్ ఇస్తేనే గానీ అన్నం తినరు. చెప్పిన మాట వినరు. ఇలా అడిగిన వెంటనే ఫోన్లు ఇవ్వడం వల్ల సకాలంలో చిన్నారులు మాట్లాడలేకపోతున్నట్లు వైద్యులు చెప్పున్నారు. ఫోన్‌లోనే గడిపేస్తుండడం వల్ల ఈ సమస్య పెరుగుతోందంటున్నారు. ఈ చిన్నారుల్లో కళ్ల సంబంధిత సమస్యలు, నిద్రలేమి వంటి ఇబ్బందులు ఉంటున్నాయి. ఈ వ్యసనం నుంచి పిల్లలను వీలైనంత వేగంగా బయటకు తీసుకొచ్చేందుకు అవకాశముంది.

రెండోది గేమింగ్ వ్యసనం. ఈ సమస్య ఇప్పుడు తల్లిదండ్రులకు నిద్ర లేకుండా చేస్తోంది. దీని బారినపడిన చిన్నారుల్లో అనేకరకాల ఇబ్బందులు ఉంటున్నాయి. ఈ వ్యసనం కలిగిన పిల్లల్లో ఎక్కువ మంది ఫ్రీ ఫైర్ తదితర గేమ్స్ ఆడుతున్నారు. ఇవి చిన్నారుల ప్రవర్తనలో మార్పులకు కారణమవుతున్నట్టు చెప్తున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం ఏడేళ్ల చిన్నారుల నుంచి ఉంటోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తినాలి అనిపించకపోవడం, నిద్రల్లో అతిగా ప్రవర్తించడం, వింతగా మాట్లాడడం, ఏకాగ్రత చూపించలేకపోవడం, చిన్న చిన్న విషయాలకు అతిగా స్పందించడం, కేకలు వేయడం, ఇరిటేషన్, కోపం వంటి లక్షణాలు వీరిలో కనిపిస్తాయి. ఎక్కువ మంది చిన్నారుల్లో నిద్రలేమి ప్రధాన సమస్యగా ఉంటుంది.

బయటపడే మార్గాలు ఇవే...

స్మార్ట్‌ఫోన్, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం అనేది మూడేళ్ల నుంచి 15 ఏళ్ల మధ్య పిల్లల్లో ఎక్కువగా ఉంటోంది. ఈ లక్షణాలతో బాధపడే చిన్నారులను వెంటనే గుర్తించి సైకాలజిస్టుల వద్దకు తీసుకెళ్లాలి. కౌన్సెలింగ్, గేమ్ టాస్కింగ్ ద్వారా ఈ సమస్య నుంచి బయటపడేలా చేస్తారు. బ్లాక్ బిల్డింగ్ వంటి ఫిజికల్ టాస్కులు ఉంటాయి. తల్లిదండ్రులు వీరిని ప్రతిరోజూ యోగా, మెడిటేషన్ వంటి కోర్సులకు, శారీరక శ్రమ కలిగించే ఆటలాడే ప్రాంతాలకు తీసుకెళ్లాలి. స్విమ్మింగ్, మ్యూజిక్ వంటి కోర్సుల్లో చేర్పించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

దూకుడుగా ప్రవర్తన



ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం వల్ల పిల్లలు దూకుడుగా ప్రవర్తిస్తున్నారు. రాత్రుళ్లు విపరీతమైన ధోరణితో వ్యవహరిస్తున్నట్టు తల్లిదండ్రులు చెప్తున్నారు. తినడం లేదు, చెప్పిన మాట వినడం లేదు, చదవడం లేదు, రాత్రుళ్లు నిద్రపోవడం లేదని పిల్లలను తీసుకువస్తున్న తల్లిదండ్రుల సంఖ్య పెరిగింది. ప్రతి చిన్నదానికి కోపగించుకోవడం, ఇరిటేషన్, నిద్ర భంగం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావాలి. కౌన్సెలింగ్ ఇప్పించాలి. నిద్ర రావడం లేదంటూ పిల్లలు ఎక్కువగా చెబుతున్నారు. అలవాట్లలో కొన్ని మార్పులు చేయడం వల్ల సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

- డాక్టర్ సాయిలహరి, మానసిక వైద్యులు
జెమ్స్ హాస్పిటల్, రాగోలు

2న సర్పంచ్‌ల చలో ఢిల్లీ



ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం కాజేసిన ఆర్థిక సంఘం నిధులతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేయడంపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ తెలిపారు. నగరంలోని పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యాన రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతినిధి బృందం చలో ఢిల్లీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థికశాఖ కార్యదర్శి, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇవ్వకుండా ఖాతాల నుంచి దారిమళ్లించి తన సొంత అవసరాలకు వినియోగించుకుందన్నారు. 2022–23 సంవత్సరానికి చెందిన రూ.2010 కోట్లు, 2023–24 సంవత్సరాలకు చెందిన రూ.2,035 కోట్లు మొత్తం రూ.4,045 కోట్లు పంచాయతీలకు విడుదల చేయకుండా అన్యాయం చేసిందని చెప్పారు. ఉపాధి హామీ చట్టం కింద వచ్చే నిధులు చట్టప్రకారం గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా సొంత అవసరాలకు, పథకాలకు వాడుకుంటున్న విషయం గురించి వివరిస్తామన్నారు. గ్రామ పంచాయతీలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలను, వార్డు మెంబర్లను డమ్మీలను చేస్తూ వారి అధికారాలను రాజ్యాంగేతర శక్తులైన గ్రామ వాలంటీర్లకు కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అలికాం సర్పంచ్ ప్రతినిధి రంధి అప్పలస్వామి, బైరివానిపేట సర్పంచ్ బైరి నరేష్, అలికాం ఎంపిటిసి వాడాడ నాగేశ్వరరావు, సింగుపురం ఎంపిటిసి పంగ సత్యనారాయణ, సానివాడ సర్పంచ్ రుప్ప లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యవస్థలపై పెరిగిన విశ్వాసం

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ఒకప్పుడు ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో వ్యతిరేక భావన ఉండేదని, అందుకు భిన్నంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగిందని రెవెన్యూ మంత్రి ధర్మా ప్రసాదరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 23వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమైందని, జిల్లాలోని 732 సచివాలయాల్లో 84 శాతం ఇళ్లను, ఈ వ్యవస్థలో పనిచేస్తున్న వాలంటీర్లు తలుపు తట్టి వారి సమస్యలు తెలుసుకున్నారని తెలిపారు. తక్కువ సమయంలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, నేడు జగన్ ప్రభుత్వం ప్రజల వద్దకు అధికారులను పంపించి సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. గతంలో ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేదని, అయినా పథకాలు అందుకోలేని స్థితి ఉండేదని పేర్కొన్నారు. నేడు లంచం అన్నదే లేకుండా పోయిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో 3.33 లక్షల ధ్రువపత్రాలను అందజేయగా, శ్రీకాకుళం నియోజకవర్గంలో 45,007 ధ్రువపత్రాలు అందజేశామని పేర్కొన్నారు.

పలాస రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి – పలాస

అమృత్ భారత్ పథకంలో భాగంగా ఎంపికైన పలాస రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా రోడ్డు డిఆర్ఎం హర్భజన్ సింగ్ బజ్వా తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన పలాస రైల్వేస్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్‌ఫారం, వేచి ఉండే గదులు, పార్కింగ్, సిబ్బంది విశ్రాంత మందిరాలు, ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయాలు, టిక్కెట్ కార్యాలయాన్ని పరిశీలించారు. స్టేషన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో పలాస రైల్వేస్టేషన్‌ను చేర్చడం వల్ల రైళ్ల నిలుపుదలతో పాటు రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయడానికి కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డిఒఎం కె.సందీప్, డిఇఇ పి.కె ప్రదాన్, డిఇఇ (జనరల్) ఎస్.కె రౌత్, ఎసిఎం మనోజ్ సింగ్, పలాస రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఆర్ఎం హర్భజన్‌సింగ్ బజ్వా

జెమ్స్‌లో ఎన్యూరిజం కాయిలింగ్ శస్త్రచికిత్స

ప్రజాశక్తి – శ్రీకాకుళం



ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా జెమ్స్ ఆస్పత్రిలో ఎన్యూరిజం ఎండోవాస్క్యులర్ కాయిలింగ్ శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జెమ్స్ న్యూరో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్టు డాక్టర్ పి.వెంకటేష్, సతీష్, ప్రియ వెల్లడించారు. జిల్లాకు చెందిన 62 ఏళ్ల వ్యక్తి తీవ్రమైన తలనొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడంతో రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి వచ్చారని తెలిపారు. తొలుత సిటి స్కాన్ తీయగా, మెదడులో అంతర్గత రక్తస్రావం ఉన్నట్లు తేలిందన్నారు. మెదడులో రక్తనాళం ఉబ్బి (ఎన్యూరిజం), అవి పగిలిపోవడం వల్ల రక్తస్రావంతో పాటు తలనొప్పి వచ్చినట్లు గుర్తించామన్నారు. మెదడులోని రక్తనాళాలకు డిజిటల్ సబ్‌స్ట్రాక్షన్ యాంజియోగ్రఫీ చేయగా, ఆంటీరియర్ కమ్యూనికేటింగ్ ఆర్టరీ ఎన్యూరిజం పగిలినట్లు తెలిసిందన్నారు. ఇలా జరిగే రోగుల్లో 10 నుంచి 15 శాతం మంది ఆస్పత్రికి తరలించే లోపే మరణిస్తారని చెప్పారు. రక్తనాళాలు పగిలిన నెల రోజుల్లోనే సగానికి పైగా మరణాలు సంభవిస్తాయన్నారు. ఈ కేసులో రోగిని అత్యవసరంగా ఎన్యూరిజం కాయిలింగ్‌కు తీసుకెళ్లామని తెలిపారు. సాధారణంగా మెదడు ఎన్యూరిజంలకు సంప్రదాయ పద్ధతుల్లో మెదడును తెరిచి క్లిప్పింగ్ చేస్తారని, ఈ రోగికి నిర్వహించిన అత్యాధునిక చికిత్సా విధానంలో తొడ రక్తనాళం ద్వారా మెదడు ఎన్యూరిజంకు కాయిలింగ్ చేయడం వల్ల తలపై ఎటువంటి రంధ్రం, కోత ఉండదన్నారు. ఎండోవాస్క్యులర్ కాయిలింగ్ వల్ల శస్త్రచికిత్స సమయంలో వచ్చే ఇతర సమస్యలు, రోగికి ప్రాణాపాయం వంటివి తక్కువగా ఉంటాయని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి చాలా త్వరగా కోలుకోడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈ శస్త్రచికిత్సను ఉచితంగా చేసినట్లు తెలిపారు.

మహిళల రక్షణలో పాలకుల నిర్లక్ష్యం

- నిపుణులతో కమిషన్ ఏర్పాటు చేయాలి
- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి
- జిల్లాకు చేరుకున్న పోరు యాత్ర రాష్ట్ర జాతా
- జాతాలో ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



మాట్లాడుతున్న ప్రభావతి



మహిళలకు స్వేచ్ఛ లేదంటూ కళాకారుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

మహిళలపై దాడులు, హింసను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. హింసపై మహిళల పోరు యాత్ర రాష్ట్ర జాతా శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. దేశంలో చిన్నారులు, మహిళలపై హింస రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని చెప్పారు. మణిపూర్‌లో ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం దారుణమన్నారు. భారత మాతాకు జై అంటూ దేశభక్తి ప్రదర్శిస్తున్న బిజెపి ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఎందుకు ఆపడం లేదని విమర్శించారు. మణిపూర్‌లో మారణకాండకు మోడీదే ప్రధాన బాధ్యత అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మతతత్వ, ఫాసిస్టు విధానాల వల్లే ఇటువంటి దారుణ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. మణిపూర్‌లో మహిళలపై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై 55 శాతం దాడులు పెరిగాయని క్రైమ్ బ్యూరో రికార్డులు వెల్లడిస్తున్నాయన్నారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్లే ఇన్ని అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ పోర్టులో రూ.మూడు వేల కోట్ల గంజాయి పట్టుబడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఎన్నికల ముందు మద్యపానాన్ని నిషేధిస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి, అధికారంలోకొచ్చాక ఆదాయం పెంచుకునే పనిలో పడ్డారని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయడానికి నిపుణులతో కమిటీ వేయాలన్నారు. మహిళలకు చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడే నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారణ చేసి కఠిన శిక్షలు విధించాలన్నారు. హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించలేని బిజెపిని గద్దె దించాలని పిలుపునిచ్చారు. మహిళలపై హింస, దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ పోరుయాత్ర ముగింపు సందర్భంగా ఆగస్టు ఎనిమిదో తేదీన విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో మహిళలు తరలిరావాలని కోరారు.

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు వై.సత్యవతి, పి.పూర్ణ మాట్లాడుతూ మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారికి శిక్షలు లేకపోవడం వల్లే హింస పెచ్చుమీరుతుందన్నారు. మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభాధ్యక్షులు, ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. నగర కన్వీనర్ శ్రీదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై దాడులు, అకృత్యాలకు బిజెపి ప్రభుత్వమే కారణమన్నారు.

జాతాలో భాగంగా ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన నాటిక, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎక్కడ వచ్చింది స్త్రీ జాతికి స్వాతంత్ర్యం అంటూ కళాకారుల నృత్యం అందరినీ అలరించింది. మద్యపానంతో జరిగే అనర్థాలపై 'మందుబాబులం మేం' అంటూ ప్రదర్శించిన నాటిక అందరినీ నవ్వులు పూయించింది. సిఐటియు శ్రీకాకుళం జాతాకు రూ.2 వేలు ఆర్థికసాయం అందించింది.


కార్మిక, ప్రజాసంఘాల సంఘీభావం

మహిళల పోరు యాత్ర రాష్ట్ర జాతాకు పలు కార్మిక, ప్రజా, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు సంఘీభావం తెలిపాయి. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.రమణి, జి ప్రియాంక, పలు సంఘాల నాయకులు సిహెచ్.రవీంద్ర, పొందూరు అప్పారావు, గొంటి గిరిధర్, జి.సింహాచలం, ఎ.మహాలక్ష్మి, ఎన్ బలరాం, పుణ్యవతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతుల మొక్కవోని దీక్ష

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

జీడిపిక్కలకు మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా కొనుగోళ్లపై రైతులు పట్టుదలతో తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కాశీబుగ్గలో 24 గంటల సత్యాగ్రహ దీక్ష చేసి తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మరో పోరు మార్గం ఎంచుకున్నారు. ఆగస్టు ఐదో తేదీ నుంచి 20 వరకు లక్ష సంతకాలు సేకరించాలని నిర్ణయించారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు, ఆర్‌బికెల ద్వారా కొనుగోళ్లు చేయాలని మూడు నెలలుగా వారు అడుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. జిల్లాకు చెందిన మంత్రులు ఉన్నా, ఒక చిన్నపాటి సమస్యకు పరిష్కారం చూపలేకపోతున్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆ సమస్య పలాస ప్రాంతానికి చెందిన అంశంగా భావించి కనీసం పట్టించుకోవడం లేదు. తన నియోజకవర్గం కాకపోయినా కోటబొమ్మాళిలోని రేగులపాడులో పలు ప్రభుత్వ కార్యాలయాలు, భవన సముదాయాల ప్రారంభోత్సవానికి వెళ్లిన ధర్మానకు తాము కనిపించడం లేదా అని పలాస జీడి రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒక సమస్యను అధ్యయనం చేయడం, వాటి పరిష్కారానికి అధికార యంత్రాంగానికి మంచి సూచనలు చేస్తారని పేరున్న ధర్మాన, ఈ విషయంలో ఎందుకు స్పందించడం లేదనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. సమస్య పరిష్కారం వల్ల తనకు ఓట్లపరంగా ప్రయోజనం ఉండదని భావిస్తున్నారా? లేక వ్యాపారులను కాదని రైతులకు మేలు చేయడం ఇష్టం లేకనా? అని రైతులు అనుకుంటున్నారు. జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న ధర్మాన తలుచుకుంటే, ఈ సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేదన్న రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అమాత్యులు ఇప్పటికైనా జోక్యం చేసుకుంటే మంచిది.



పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా, జీడి రైతుల గోడును ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని రైతులు నినదించిన ప్రతి సందర్భంలో మొక్కుబడి సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. రైతులు, వ్యాపారులతో పలు పర్యాయాలు చర్చలు జరిపినా, అవి అమలు కాకపోవడం మంత్రి అప్పలరాజు అసమర్థతకు అద్దం పడుతోంది. పిక్కల కొనుగోళ్లు, మద్దతు ధర విషయంలో మంత్రి అప్పలరాజు మూడేళ్లుగా రైతులను మోసం చేస్తూనే ఉన్నారు. 2020లో వ్యాపారులు, రైతులతో సమావేశం నిర్వహించి 80 కేజీల బస్తాకు రూ.10 వేలుగా ప్రకటించారు. అందులో ప్రభుత్వం తరుపున రూ.వెయ్యి చెల్లిస్తామని హామీనిచ్చారు. ఇప్పటివరకు ఆ డబ్బులు ఇవ్వలేదు. తర్వాత సంవత్సరం ప్రభుత్వమే పిక్కలను కొంటుందని, 80 కేజీల బస్తాకా?, క్వింటాకా? ధర నిర్ణయంలో ఉందంటూ మంత్రి అప్పలరాజు ఆ ఏడాది ఊరించారు. ఈనెల 19న మరోసారి వ్యాపారులు, రైతులతో సమావేశం నిర్వహించిన మంత్రి అప్పలరాజు రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే బస్తాకు రూ.9 వేలు ఇచ్చేయండంటూ వ్యాపారులను ఆదేశించి చేతులు దులుపుకున్నారు. జీడి పంట చేతికొస్తున్న మార్చిలోనే వ్యాపారులు రూ.10వేల వరకు చెల్లించారు. బస్తాకు రూ.వెయ్యి తగ్గించి రూ.తొమ్మిది వేలకు కొనుగోలు చేయాలని మంత్రి సలహా ఇవ్వడం విచిత్రంగా ఉంది. రైతులకు మేలు చేయాల్సిన మంత్రి అప్పలరాజు వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. ఇప్పటివరకు రైతుల నుంచి తూకం వేసి జీడి పిక్కలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులకు ఇక ఆ శ్రమ అవసరం లేకుండా చేయాలని చూస్తున్నట్లుగా మంత్రి మాటలను బట్టి స్పష్టమవుతోంది.

కాశీబుగ్గలో ఈ నెల28న రైతులు ఆహారం మాని 24 గంటల సత్యాగ్రహ దీక్షకు దిగితే మంత్రి అప్పలరాజు ఆ రోజు ఉద్దానం రక్షిత మంచి నీటి పథకం పనుల పరిశీలన పేరిట హడావుడి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులను వెంటబెట్టుకుని హిరమండలం రిజర్వాయర్ వద్ద ట్రయల్ రన్, మెళియాపుట్టిలో బహిరంగ సభ నిర్వహించి చాలా ఉద్వేగంగా మాట్లాడారు. ఉద్దానమా నీ రుణం తీర్చుకుంటాం అంటూ మాటలు చెప్పిన మంత్రి, ఉద్దానం రైతుల రుణం మాత్రం తీర్చుకోకుండా మూడేళ్లగా వారిని వంచిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా మంత్రి అప్పలరాజు జీడి పిక్కలకు బస్తాకు రూ.16 వేలు, ఆర్‌బికెల ద్వారా కొనుగోళ్లు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. లేకుంటే జీడి పోరు చిలికిచిలికి గాలివానలా మారి ప్రభుత్వానికి, పార్టీకి నష్టం కలిగించే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయం వినిపిస్తోంది.

'జగనన్న సురక్ష'తో సేవలు సులభతరం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని

ప్రజాశక్తి – ఆమదాలవలస

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పౌర సేవలు మరింత సులభతరమయ్యాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ అధికారులతో జగనన్న సురక్ష కార్యక్రమంపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష వంటి ప్రతి కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతమయ్యాయని తెలిపారు. 1902 పేరిట జగనన్నకు చెబుదాం కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చిందని, దానికి అనుసంధానంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు సేవలు సులభతరం చేశారని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెల రోజుల పాటు విజయవంతంగా నిర్వహించి 11 రకాల సర్టిఫికెట్లు, పథకాలు లబ్ధిదారులకు అందజేయాలన్న లక్ష్యంతో చేపట్టినట్లు వివరించారు. ఇప్పటివరకు ఎన్ని అర్జీలు అందాయి?, వాటిలో ఎన్ని పరిష్కారానికి నోచుకున్నాయి?, ఎన్నిరకాల సేవలకు సంబంధించి సర్టిఫికెట్లు అందజేసిందన్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతికపరమైన కారణాలతో పెండింగ్‌లో ఉంటే వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్దేశించిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వైస్ ఫ్లోర్‌లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, పొడుగు శ్రీను, సాధు చిరంజీవి, సచివాలయాల కోఆర్డినేటర్లు బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, ఎ.రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

31న వంట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10 వేలు కనీస వేతనం అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలని తదితర డిమాండ్లతో ఈనెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి తెలిపారు. ధర్నాకు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నా పోస్టర్లను సంఘ అధ్యక్షులు ఎ.పద్మతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తించకుండా పనిచేయించుకుంటోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యానికి విరుద్ధంగా పథకానికి, వంట కార్మికులకు కావాల్సిన నిధులను కేటాయించకుండా పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కనీస వేతనాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని చెప్పారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల విలీనం వల్ల అనేక చోట్ల పాఠశాలలు మూతపడ్డాయని, దీనివల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ ఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటమ్‌తో ప్రభుత్వం మెనూ తయారు చేసి వర్కర్లపై భారాన్ని మోపిందన్నారు. కార్మికులకు కనీస వేతనాలతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆదిలక్ష్మి, కళావతి, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

సంక్షేమ పథకాలతో ఆర్థిక తోడ్పాటు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకు ఆర్థిక తోడ్పాటు అందుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తురకపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యం, సేద్యం రంగాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందని అన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చారని, అలాగే జలజీవన్ మిషన్ పథకంతో ఇంటింటికీ తాగునీటిని అందించే కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. గ్రామాల్లో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయేమోనని తెలుసుకోవడానికే గడపగడపకు మన ప్రభుత్వమని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, సర్పంచ్ ప్రతినిధి మామిడి ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. నువ్వలరేవులో సర్పంచ్ ఎఱ్ఱా, ఉపసర్పంచ్ దేవా ఆధ్వర్యాన శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నువ్వలరేవు ఫిష్ లాండింగ్ స్థానంలో జెట్టి నిర్మాణానికి డిజైన్ మార్చి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు హనుమంతు వెంకటరావుదొర, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైసిపి అధ్యక్షులు పి.గురయ్యనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వడ్డి కరుణాకర్, ఇరోతు హేమంతరాజు, బైనపల్లి రఘు, సొసైటీ అధ్యక్షుడు నీలాంబరి, త్రినాథ్, ముకుంద, కృష్ణ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాజమాన్య ప్రతినిధులు

'కాకినాడ ఆదిత్య' డిగ్రీ విద్యార్థిని ప్రతిభ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ విద్యార్థిని ఎ.ప్రత్యూష ఇటీవల జరిగిన ప్రముఖ మల్టీ నేషనల్ సంస్థ ఇవైలో ఉద్యోగానికి ఎంపికైంది. ఆమెకు రూ.13.5 లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నట్టు కంపెనీ ఆమోదం తెలిపిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బి.వి.ఎల్.నాయుడు కళాశాలల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణారెడ్డి, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి ఆమెను అభినందించారు.

ఆర్థికసంఘం నిధులు మళ్లిస్తే ఎలా?

ఎంపీ చంద్రశేఖర్‌ను నిలదీసిన సర్పంచ్‌లు

ప్రజాశక్తి- జి.సిగడాం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మీసాల సత్యవతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సమావేశం వాడివేడిగా సాగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను పలువురు సర్పంచ్‌లు సమస్యలపై నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం నిధులు మింగేస్తే పంచాయతీలు ఎలా అభివృద్ధి చెందుతాయని గొబ్బూరు, మదుపాం సర్పంచ్‌లు మహాదాశ్యం చిన్నారావు, బి.అప్పలనాయుడులు ఎంపీని నిలదీశారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో వీధి దీపాలు వేయలేక, కాలువల్లో పూడికలు తీయలేక, విద్యుత్ ఛార్జీలు చెల్లించలేకపోతున్నామని మండిపడ్డారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటిపడటంతో ప్రజలతో నానా చీవాట్లు తినాల్సివస్తుందని వాపోయారు. గ్రీన్ అంబాసిటర్లకు నెలనెలా జీతాలు చెల్లించడం లేదని అన్నారు. అలాగే వాలంటీర్లకు ఇస్తున్న గౌరవం సర్పంచ్‌లకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ఎంపీ సమాధానం ఇస్తూ... గ్రీన్ అంబాసిటర్లకు జీతాలు ఇవ్వాలింది కేంద్ర ప్రభుత్వమని, కేంద్ర ప్రభుత్వమే చేతులు ఎత్తేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేస్తుందని అన్నారు.


ఎంపీని నిలదీస్తున్న సర్పంచ్‌లు

ఇదివరలో ఎలా జరిగేదో అలానే చేసుకోవాలని సర్పంచ్‌లకు సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కింద ఎక్కడికక్కడ తవ్వేసి వదిలేశారని, అవి అసంపూరిగా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని, ఇదేనా ప్రభుత్వం పనితీరని నిలదీశారు. చెత్త నుంచి సంపద కేంద్రం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా... ఇప్పటికీ బిల్లులు చెల్లించలేదని గొబ్బూరు సర్పంచ్ చిన్నారావు నిలదీశారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని మండలంలోని గ్రామాలకూ తాగునీరు సరఫరా చేయాలని నీటిపారుదల ఎఇ భాగ్యలక్ష్మిని కోరారు. విద్యుత్ ఎఇ జి.తిరుపతిరావు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎంఇఒ రవి మాట్లాడుతూ మండంలోని 27 పాఠశాలల్లో నాడు-నేడు కింద అభివృద్ధి చేశామని అన్నారు. పలు ప్రాంతాలకు బస్సు సదుపాయం కల్పించాలని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఎంపీకి విన్నవించుకున్నారు. వెంటనే సంబంధిత ఆర్‌టిసి అధికారులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకుంటే బస్సు సదుపాయం కల్పిస్తామని అధికారి బదులిచ్చారు. సిగడాం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిపి ప్రతినిధి కోరారు. అంగన్వాడీ భవనాలు లేక చిన్నారులు, కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని పాలఖండ్యాం సర్పంచ్ ప్రతినిధి దారబోయిన ధర్మరాజు ఐసిడిఎస్ అధికారి తమ్మినేని జయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జెడ్‌పిటిసి కాయల రమణ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపిపి తోడేటి వెంకటరమణ, ఎంపిడిఒ కె.నిశ్చల, భూ రీ సర్వే డిటి హనుమంతరావు, ఎపిఒ సత్యనారాయణ, వెటర్నరీ డాక్టర్ ఉప్పాడ సుమన్, డాక్టర్ శ్రీహరిత, వైస్ ఎంపిపి తోలేటి వెంకటరమణ, ఎపిఎం రెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

డెంగీతో జవాను మృతి


సోమేశ్వరరావు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని సరియాపల్లికు చెందిన కోనాడ సోమేశ్వరరావు (45) బిఎస్ఎఫ్ జవాన్ డెంగీ వ్యాధితో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమేశ్వరావు ఢిల్లీలో విధులు నిర్వహిస్తుండగా డెంగీ జ్వరం రావడంతో చికిత్స కోసం సెలవపై ఈ నెల 26న స్వగ్రామానికి వస్తున్నాడు. జర్వం తీవ్రత కావడంతో తనతో పాటు ఢిల్లీ నుంచి వస్తున్న రామయ్యపేటకు చెందిన వ్యక్తి ఇంటికి సమాచారం ఇచ్చారు. శుక్రవారం కుటుంబ సభ్యులు విజయనగరం రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడ నుంచి సోమేశ్వరరావుకు శ్రీకాకుళం ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య మీనాక్షి, కుమార్తె జోతిర్మయి, కుమారుడు ఆదిత్యలు ఉన్నారు. సోమేశ్వరావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

కనీస వేతనం అమలు చేయాలి

టెక్కలి రూరల్ : మహిళలను నిరంతరం చైతన్య పర్చుతూ డ్వాక్రా గ్రూపుల్లో చేర్పిస్తూ... ప్రభుత్వ స్కీమ్‌ల్లో చురుకుగా పాల్గొంటూ... పాలకులకు సహాయ సహకారాలు అందిస్తున్న విఒఎలకు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. విఒఎల మండల సంఘం అధ్యక్షులు లక్ష్మమ్మ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఒఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య, హెచ్.ఈశ్వరరావులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, బ్యాంకులకు అనేక విధాలుగా విఒఎలు సహకరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అసిరినాయుడు, ఎస్.గంగయ్య, శకుంతల, శ్రీలత, జ్ఞానేశ్వరి, ప్రమీళ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహాలక్ష్మి

మణిపూర్ మరణకాండను అరికట్టాలి


శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను అరికట్టాలని, మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ... నగరంలోపి పిఎస్ఎన్ఎమ్ హైస్కూల్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 రోజులుగా మహిళలను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలు, విధ్వంసాలు, మారణకాండతో మణిపూర్ తగలబడుతున్నా ప్రధాని మోడికి పట్టకపోవడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ మారణకాండపై ప్రధాని మౌనం వీడాలని డిమాండ్ చేశారు. ఒక వర్గాన్ని లక్ష్యంగా సుమారు 150 మందిని హత్య చేయడం దారుణమన్నారు. కుకి తెగకు చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించడంతో పాటు వారి కుటుంబాలను హతమారుస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని విమర్శించారు. సుప్రీం కోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప ప్రధాని మోడి నోరు విప్పలేదని అన్నారు. సత్యాన్ని బయటకు రానీయకుండా ఇంటర్నెట్‌ను నిలుపుదల చేశారు. మహిళలపై నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటనలు వందలు జరిగాయని, అందుకే ఇంటర్నెట్ నిలుపుదల చేశామని ఆ రాష్ట్ర బిజెపి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చెప్పడం దారుణమని అన్నారు. మతోన్మాద ఉన్మాదానికి బలైన మణిపూర్ ఘటనకు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లే కారణమని అన్నారు. ఆంధ్రాలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు గోడమీద పిల్లివాటంలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు డి.సుధ, ఎన్.వి.రమణ, అల్లు సత్యనారాయణ, ఎన్.హైమవతి, కె.సుజాత పాల్గొన్నారు.

టెక్కలిలో మానవహారం

టెక్కలి రూరల్ : మణుపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడంపై ఖండిస్తూ టెక్కలి ఇందిరాగాంధీ కూడలి వద్ద వైసిపి నాయకులు బలగ ప్రకాష్ ఆధ్వర్యాన శనివారం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత గిరిజనులు వెనుకబడిన వర్గాల హక్కులపైన, వారి ఉనికిపై పెద్ద దాడి జరుగుతుందని అన్నారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం మణిపూర్ సంఘటనని అని అన్నారు. తక్షణమే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత వహిస్తూ... రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : మానవహారం చేపడుతున్న విద్యార్థులు

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ఇంత నిర్లక్ష్యమా?


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై వైసిపి ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమా అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రశ్నించారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.21,442 కోట్లు కేటాయిస్తే, ఈ నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం కేవలం రూ.4,375 కోట్లు కేటాయించిందని విమర్శించారు. ఉత్తరాంధ్రలోని వంశధార, నాగావళి, ఆంధ్రాలోని పెన్నా, గోదావరి, కృష్ణ నదులతో పాటు రాష్ట్రంలోని 69 నదులను అనుసంధానం టిడిపి హయాంలో చేశామని అన్నారు. వంశధార ప్రాజెక్టు పరిధిలో 2,55,510 ఎకరాలకు టిడిపి రూ.871 కోట్లు ఖర్చు పెడితే... వైసిపి కేవలం రూ.352 కోట్లు ఖర్చు పెట్టిందని ఎద్దేవా చేశారు. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్, మహేంద్ర తనయా, ఆఫ్‌షోర్, రైవాడ రిజర్వాయర్, పట్టిసీమ ఎత్తిపోతల పథకం, పులిచింతల ప్రాజెక్టు, పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణాల్లో వైసిపి ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేంద్ర తనయా, ఆఫ్‌షోర్‌కు రూ.9 కోట్లు, రైవాడ రిజర్వాయరుకు రూ.4 కోట్లు, పులిచింతలకు రూ.40 కోట్లు పెట్టి గేట్లు కొట్టుకుపోయేలా చేసిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు మాణిచంద్ర ప్రకాష్, పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, బాసుదేవ్ రౌలో, బెందాలం విజయ్, కొర్రాయి వాసుదేవ్, సంతోష్ పట్నాయక్, పుల్లట సంతోష్, బాసుదేవ్ ప్రధాన్, రంగా రౌలో పాల్గొన్నారు.

జీడిని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ఆమదాలవలస : జిల్లాలోని పలాస ఉద్దానంలో పండే జీడి పంటను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ సనపల అన్నాజీరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కొర్లకోటలో ఆయన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జీడి రైతులకు ప్రభుత్వం వెంటనే మద్దతు ధర ప్రకటించాలన్నారు. జిల్లాలో జీడి పిక్కలు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పండే జీడి పిక్కల పంటను ముందుగా కొనుగోలు చేసి ఆ తర్వాతే విదేశీ పిక్కలను దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. తెల్ల బంగారంగా పిలవబడే జీడి పంటకు మద్దతు ధర ఇచ్చి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు చేస్తున్న వారి న్యాయమైన ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ మద్దతు పలుకుతున్నామని తెలిపారు.

జగనన్న కాలనీల్లో జనసేన నిరసన


పొందూరు: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఫెయిల్యూర్ ఆఫ్ జగనన్న కాలనీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొంచాడ, రాపాక గ్రామాల్లోని జగనన్న కాలనీలను శనివారం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు మాట్లాడుతూ రాపాకలో ఒక ప్రమాద కరమైన కొండ కింద ఇళ్ల స్థలాలు కేటాయించడం పేదల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అని మండిపడ్డారు. పేదలకు నీళ్లు అందించడంలో భాగంగా ఏమో ఒక చెరువులో ఇళ్ల స్థలాలు కేటాయించారని ఎద్దేవా చేశారు. గ్రామంలో 34 మందికి పట్టాలు ఇస్తున్నామని చెప్పి పేదల చెవుల్లో పెద్ద పువ్వులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు యలకల రమణ, సీనియర్ నాయకులు కొంచాడ చిన్నంనాయుడు, ముల్లు హరినాథ్, జామన అప్పలనాయుడు, బాబూరావు, పైడి మురళీమోహన్, కొంచాడ సూర్య, పొన్నాడ బాలకృష్ణ, కోరాడ రాజు, రామ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కవిటి: ముంపు, లోతట్టు ప్రాంతాలు కాలనీలకు కేటాయించి ఇళ్లు కట్టుకోమంటే, కలకాలం ఉండాల్సిన తన ఇంటిని ఆ బురద నీటిలో సామాన్యుడు ఎలా కట్టుకుంటాడని ఇచ్ఛాపురం జనసేన నాయకుడు దాసరి రాజు ప్రశ్నించారు. ఈ మేరకు మండలంలోని కుసుంపురం, కొత్తపాలెం గ్రామాల్లో జగనన్న కాలనీలను సందర్శించి ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. జనసేన మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, రోకళ్ల భాస్కర్, అంగ సురేష్, దుగాన దివాకర్, బడగల రామకృష్ణ పాల్గొన్నారు.

టెక్కలి : పేదలకు కేటాయించిన జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పన ఎక్కడ ఉందని జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ ప్రభుత్వానికి ప్రశ్నించారు. స్థానిక జగతిమెట్ట వద్ద నిర్మాణంలో ఉనన జగనన్న కాలనీని సందర్శించిన ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అట్టాడ శ్రీధర్, ఇలపండ రమేష్, పేడాడ త్రివేణి, కోత్తూరు హరి, లింగూడు కుమారస్వామి, జి.భాస్కర్ పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని గుమ్మాడంలో ఉన్న జగనన్న కాలనీలను జనసేన నాయకులు సందర్శించిన ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. కోలా రాజేష్, కె.బాబాజీ, రాంబాబు, వేణు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మెళియాపుట్టి జగన్న కాలనీలో జనసేన నాయకుల దుక్క బాలరాజు, ఎస్.చంటి, కిరణ్, ప్రశాంత్, హరికృష్ణలు సందర్శించిన ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు.


టెక్కలి : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఎస్‌సి, ఎస్‌టిల ఉన్నతికి చర్యలు


మాట్లాడుతున్న కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని షెడ్యూల్డ్, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి పంచ సూత్రాలు పాటిస్తున్న స్వయం శక్తి సంఘ మహిళలకు వారి జీవనోపాధులను ఏర్పాటు చేసుకోవడానికి, ఉన్న జీవనోపాధులను మెరుగుపరుచుకోవడానికి ఉన్నతి పథకంలో వడ్డీ లేకుండా రుణాలను మంజూరు చేస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని వెదుళ్లవలస గ్రామ సంఘంలో హరిజన వీధిలో గల స్వయం శక్తి సంఘాల పనితీరును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా సమావేశం పెట్టుకొని పొదుపులు చెల్లించడం, వాయిదాల ప్రకారం అప్పులు తీర్చుకోవడం, పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సంఘంలో ఒక్కో సభ్యులకు, వారు నిర్ణయించుకున్న యూనిట్ ప్రకారం రూ.లక్ష వరకు ప్రభుత్వం ఉన్నతి పథకంలో వాయిదాలు సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ లేకుండా మంజూరు చేసే అవకాశం ఉందని సూచించారు. సంఘాలు పంచ సూత్రాలు పాటించడం లేదని సంఘాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తపరిచారు. పంట పొలం ఉన్న మహిళా రైతులూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకొని తద్వారా ఉమ్మడి ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిసి రామప్పడు, రమ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఈ-బైక్‌లదే హవా

రెవెన్యూ మంత్రి ధర్మాన

శ్రీకాకుళం అర్బన్ : రోజురోజుకూ మానవాళికి పెనుసవాలుగా మారుతున్న వాతావరణ కాలుష్య నివారణలో భాగంగా ఈ బైకులకు ప్రాణవన్యత పెరుగుతోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పెదపాడు రోడ్డులో దేశంలోనే మొట్టమొదటిగా మినీ ఏథర్ ఎక్స్ పీరియన్స్ షోరూమ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమైన, సౌకర్యవంతమైన ఈ బైకును తయారు చేయడం అభినందించదగ్గ విషయన్నారు. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా భారతీయతను చాటుకోవాలన్నారు. మొదటి కొనుగోలుదారులు బి.కృష్ణ, ఎ.విజయ్, సత్యనారాయణరెడ్డిలకు మంత్రి తాళాల నమూనాలను అందజేశారు. లీలామయి ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ చైతన్య మాట్లాడుతూ ప్రస్తుతం ఆరు రంగుల్లో ఈ బైకులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వీటి ధర ప్రస్తుతం బేసి వేరెంట్ 450 ఎక్స్ షోరూం ధర రూ.1,67,248గా ఉందని పేర్కొన్నారు. ప్రో ప్యాక్ రూ.1,88,248గా శుక్రవారం నాటి రేటు ఉందని వివరించారు. మూడున్నర గంటల ఛార్జింగ్‌తో 90 కిలో మీటర్లు ప్రయాణించవచ్చునని అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పెదపాడు రోడ్డులో రెండు, విజేత హోటల్ వద్ద ఒకటి ఛార్జింగ్ పాయింట్ పెట్టామని తెలిపారు. ఎంత దూరం ప్రయాణించాం, ఇంకా ఎంత ఛార్జింగ్ ఉంది, ఆ ఛార్జింగ్‌తో ఎంత దూరం చేయవచ్చునని వివరాలు వాహనంలోనే ఇండికేటర్‌లో చూపిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎండీ మోహన్, విశ్రాంత డిఆర్ఒ మాణిక్యాలరావు, రవీంద్ర, ఈశ్వర్, ఫణి, బి.దామోదర్, బొడ్డేపల్లి రమేష్ పాల్గొన్నారు.


నమూనా కీని అందజేస్తున్న మంత్రి ధర్మాన

గడ్డి మందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్


దుర్గాప్రసాద్ (ఫైల్)

మండలంలోని పతివాడ పాలెంకు చెందిన పతివాడ దుర్గప్రసాద్ (25) విశాఖపట్నం కెజిహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దుర్గాప్రసాద్ గురువారం తన ఇంటివద్ద కలుపు మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు వైద్యులు సిఫార్స్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి తల్లిదండ్రులు నారాయణమ్మ, రాము, తమ్ముడు వాసు ఉన్నారు. ఇంటి పెద్ద కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుని మృతదేహం గుర్తింపు

పోలాకి: మండలంలో రాజపురానికి చెందిన మాగుబారి భాస్కరరావు (32) యువకుని కళేభరం స్థానికులు గుర్తించారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే సిఐ బి.ప్రసాదరావు, ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాజపురానికి చెందిన భాస్కరరావు సీమేన్‌గా పనిచేస్తున్నారని అన్నారు. రెండు నెలల క్రితం ఇంటికి వచ్చాడన్నారు. ఇంతలో నెల రోజుల క్రితం ఇంటి దగ్గర చెప్పకుండా బయటకు వెళ్లాడని, తిరిగి ఇంటికి చేరలేదని అన్నారు. దీనిపై గత నెలలో తండ్రి గణపతిరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేశామని తెలిపారు. శనివారం కొత్తరేవు సమీపంలో జీడితోట దగ్గర ఆ యువకుని ద్విచక్ర వాహనం, అతని షర్ట్‌తో చెట్టుకు వేలాడిన కళేబరాన్ని స్థానికులు గుర్తించారని అన్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు


వివరాలను సేకరిస్తున్న సిఐ శ్రీనివాసరావు

బావపై బావమరిది దాడి

పలాస : సొంత బావపై బావమరిదిపై కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం కాశీబుగ్గలో ఓ ప్రయివేటు ఆస్పత్రి వద్ద చోటుచేసుకుంది. నందిగాం మండలం చిన్నారిగోకర్లపల్లికు చెందిన సానుపల్లి ఢిల్లీశ్వరరావుపై ఆయన బావమరిది మొళియాపుట్టి మండలం టకోయికు చెందిన పోలాకి శంకరరావు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఢిల్లేశ్వరరావుపై ఆయన బావమరిది తలపై కత్తితో దాడికి యత్నించగా ప్రమాదం పసిగట్టిన ఆయన త్రుటిలో తప్పించుకోగా, భుజంపై తీవ్ర గాయమైంది. ఘటనా జరిగిన వెంటనే ప్రయివేటు ఆస్పత్రి వద్ద ఉన్న జనాలు రావడంతో శంకరరావు పరారయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడి మంచి వివరాలు సేకరించారు. బావ, బావమరుదులు ఇద్దరూ కలిసి వ్యాపారాలు చేసుకుంటు కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆరు నెలల క్రితం వీరి వ్యాపారలావాదేవీల్లో విభేదాలు రావడంతో ఇద్దరూ విడిపోయి ఎవరి వ్యాపారాలు వారు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఢిల్లేశ్వరరావు పెద్దమ్మ మహాలక్ష్మి, అనారోగ్యంతో కాశీబుగ్గలో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెను చూడడానికి బావ, బావమరిదులు ఇద్దరూ వచ్చారు. ఎదురెదురుగా వారు తారసపడడంతో గొడవ ప్రారంభమైంది. అనంతరం శంకరరావు కత్తితో దాడి చేసి గాయపరిచాడు. కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద కాలువలో వ్యక్తి గల్లంతు

పోలాకి: పోలాకి పెద్ద కాలువలో ముప్పిడి శాంతారావు శనివారం గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల కురిసన వర్షాలకు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. పోలాకికి ఆణించి ఉన్న పెద్ద

క్రైమ్ కార్నర్

కాలువలో గుర్రపు డెక్కతో నిండి ఉంది. దీనిని తొలగించేందుకు గ్రామస్తులు కాలువలోకి దిగారు. కాలువలో నీరు ఉధృతంగా ఉండడంతో పని చేస్తున్న సమయంలో శాంతారావు కొట్టుకుపోయాడు. వెంటనే తోటి వారు రక్షించేందుకు ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఎప్పటికీ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వెంటనే ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందించి అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, ఆర్.త్రినాథరావు, సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, ఎం.వి.నాయుడు గాలింపు చర్యలను పరిశీలించారు.

దొంగలు బాబోయ్

పొందూరు: మండలంలోని ఇటీవల రాత్రి వేళల్లో దొంగతనాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పొందూరు పంచాయతీ రాపాక కూడలి సమీపం కుమ్మరి కాలనీలో నివాసం ఉంటున్న కె.దుర్గాప్రసాద్‌కు చెందిన బైక్ శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇంటి ఆవరణంలో నిలిపి ఉంచిన ఈ బైక్ కనిపించకపోవడంతో స్థానిక పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇదే విధంగా ఈ నెల 13న రాత్రి కూడా రాపాకలో ఆంజనేయ ఆలయం సమీపంలో సంచాన రాజారావుకు చెందిన బైక్ చోరీకి గురైంది. వారం రోజుల క్రితం పొందూరు ఖాదీ బండారు సమీపంలోను, అంబేద్కర్ కూడలిలోను, రాపాక కూడలిలోను కిరాణా బడ్డీల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మండలంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల నిఘా కొరవడడంతో చోరీలు చోటుచేసుకుంటున్నాయని, దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టిని సారించి నిఘాను పెంచాలంటూ ప్రజలు కోరుతున్నారు.


అగ్నిమాపక సిబ్బందితో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

ఎంపిపి భర్తపై ఫిర్యాదు

సంతబొమ్మాళి : ఎంపిపి భర్త మేరుగు అప్పారావు తన పొలాన్ని అక్రమంగా ఆక్రమించుకున్నారని ఉమిలాడ లక్ష్మీదేవి సంతబొమ్మాళి ఎస్ఐ కె.మధుసూదనరావుకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ 2001లో తన చెల్లి, ప్రస్తుత ఎంపిపి రాజేశ్వరి దగ్గర కొనుగోలు చేశానని అన్నారు. అనంతరం ఆ భూమిని కౌలుకు చెల్లికి అప్పగించి తాను బిలాయి వలస వెళ్లిపోయానని తెలిపారు. ఇప్పుడు ఆ భూమి తనదని ఎంపిపి భర్త అప్పారావు దౌర్జన్యం ఆక్రమించుకున్నాడని వాపోయింది. అడంగల్ కూడా రాకుండా చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఇంతకుముందే టెక్కలి సబ్ కలెక్టర్ కూడా ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం లేదని ఆమె వాపోయింది. తనకు న్యాయం జరగకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరారు.

జూదరుల అరెస్టు

నౌపడ : సంతబొమ్మాళి మండలం మూలపేటలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కిషోర్‌వర్మ శనివారం తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.14,200 నగదు స్వాధీనం చేసుకుని జూదరులను అరెస్టు చేశామని తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

చెవిటమ్మతల్లి ఆలయంలో చోరీ

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని ఐదో వార్డు పరిధిలోని సొట్టమనిపేట చెరువు గట్టుపై ఉన్న చెవిటమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వెండి కిరీటం, డబ్బుల హుండీ, సిసి కెమెరాలను దొంగిలించారు. ఇదే విషయమై స్థానిక ఎస్ఐ వై.కృష్ణను వివరణ కోరగా... ఎటువంటి ఫిర్యాదు అందలేదని, విషయం తెలిసిన వెంటనే స్వచ్ఛందంగా వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించామని తెలిపారు.



మాట్లాడుతున్న చింతాడ రవి

ప్రతిపక్షాలవి అర్థం లేని ఆరోపణలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు వైసిపిపై చేస్తున్న విషప్రచారాలను నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్ రాష్ట్రానికి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టలేదని అన్నారు. ఆరు లక్షల వరకు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలను కల్పించారని, అవి ప్రతిపక్ష నాయకులకు కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగమూ తీయలేదని బరితెగించి చంద్రబాబు, లోకేష్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చిగురుపల్లి రవికుమార్, కొప్పల ఈశ్వరరావు, దానేటి రామమోహన్, గురుగుబెల్లి భాస్కర్, గిరి, రాఘవేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాసాగర్

పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి పాలనలో సాగునీటి ప్రాజెక్టులు పడకేశాయని టిడిపి లీగల్ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నారాయణపురం ఆనకట్టు ఆధునికీకరణకు జైకా నిధులను రూ.72 కోట్లు టిడిపి హయాంలో మంజూరు చేస్తే... అవి ఖర్చు చేయపోవడంతో వెనక్కి వెళ్లిపోయాయని విమర్శించారు. మున్సిపాలిటీలో రూ.66 కోట్లతో టిడిపి హయంలో నిధులను కూన రవికుమార్ తీసుకువచ్చారని అన్నారు. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ తరువాత శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పట్టణంలో తాగునీరు అందించేందుకు శంకుస్థాపన చేశారని అన్నారు. కానీ, ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలో 106 చెరువులు ఉన్నాయని, 96 చెరువులను టిడిపి హయాంలో నీరు చెట్టు పథకం కింద బాగు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపతిరావు మురళి, బి.వి.రమణమూర్తి, తంగి గురయ్య తదితరులు పాల్గొన్నారు.



లైన్ షోయింగ్ పద్ధతిలో నాట్లు వేస్తున్న కూలీలు

'లైన్ షోయింగ్'తో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- రణస్థలం

వరిలో లైన్ షోయింగ్ చేయడంతో చీడపీడల నుంచి రక్షణ కలుగుతుందని, గాలి, వెలుతురు తగిలి పిలకల పరిమాణం పెరుగుతుందని, దీనివల్ల అధిక దిగుబడి సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ఎస్‌డిఎ రాంబాబు అన్నారు. మండలంలోని బంటుపల్లిలో టి.సింహాచలం వరి పొలంలో శనివారం వరి లైన్ షోయింగ్ పద్ధతులపై ఉబాలు వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వరి లైన్ పద్ధతులు వేస్తే ప్రకృతి యాజమాన్య పద్ధతులు పాటించడానికి అనువుగా ఉంటుందని అన్నారు. వరి దుబ్బులు పెద్దగా వేపుగా పెరిగి రైతులకు అధిక దిగుబడును తీసుకోవడానికి వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది టి.సునీత, టి.అంజలి, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జగనన్న భూ రక్ష రీ సర్వేతో భూ సమస్యలకు చెక్ పడుతుందని అమలపాడు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. అమలాపాడు పంచాయతీ పరిధిలో ఉద్దానం నారిసింగబెల్లిలో శనివారం భూముల రీ సర్వే క్షేత్రస్థాయి పూర్తయినట్లు తెలిపారు. గ్రామంలోని ఇంటింటికీ అధికారులు కలిసి వెళ్లి 280 ఖాతాలకు సంబంధించి 9(2) పత్రాలను అందచేశారు. 207 ఎకరాలకు రీ సర్వే నిర్వహించారని తెలిపారు. నోటీసులు అందుకున్న రైతులు తమ వివరాలు, హద్దులు సరి చూసుకోవాలని కోరారు. వివరాలు విస్తీర్ణం హద్దుల్లో తేడాలు ఉంటే వెంటనే రెవెన్యూ సర్వే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు జగనన్న భూ సర్వే ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కరాడ గిరి దున్న, ఢిల్లీరావు, సర్వేయర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న టిడిపి నాయకులు

బదిలీ ఉద్యోగులకు సన్మానం

కవిటి: మండలంలోని బెలగాం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఆమదాలవలస మండలం బదిలీ అయిన సురేష్, జెఎల్‌ఎంగా పనిచేసి పలాస బదిలీ అయిన కోళ్ల త్రినాథ్‌లను బెలగాం పంచాయతీ టిడిపి నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి సంతోష్ పట్నాయక్, తేజారావు, మణిచంద్ర, మృత్యుంజయ పట్నాయిక్, కేశవ, వెంకటరావు, తులసయ్య, పాపారావు, రంగ, నేతాజీ, నీలాద్రి, ధర్మ, శ్యాం, సాయి రుక్కు, నారాయణ, బాలకృష్ణ, మాధవరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హుల ఇంటికే సంక్షేమ ఫలాలు



రణస్థలం : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం : అర్హుల ఇంటికే సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కోష్ట సచివాలయ పరిధిలోని జగనన్న సురక్షలో పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ సంక్షేమం అందుతుందని జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సైనూరు సచివాలయంలో సర్పంచ్ అట్టాడ గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, ఎంపిటిసి జి.మాకయ్య, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, డిటి వాయిలపల్లి గిరిరాజ్, మాజీ సర్పంచ్ జి.గున్నమ్మ, సచివాలయ కన్వీనర్లు మార్పు రవికుమార్, గోకిన గణపతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని విశ్వనాథపురం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వా వాణి పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రజలు కొన్నిఏళ్లుగా మా గ్రామానికి ఎలాంటి మౌళిక సదుపాయాలు కల్పించలేదని, డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్లపై వస్తుందని వివరించారు. జగనన్న కాలనీలో తమకు ఇళ్ల కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, జెఎసి కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు పాల్గొన్నారు.

'ఆఫ్‌షోర్' పూర్తి చేయరా?



పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

పలాస : టిడిపి హయాంలో రూ.553 కోట్లు ఖర్చు చేస్తే... వైసిపి హయాంలో కేవలం రూ. 9 కోట్లు ఖర్చు చేసిందని, వైసిపి హయాంలో ఆఫ్‌షోర్ పూర్తి కాదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయరును శనివారం పరిశీలించి ఛాలెంజ్ సెల్ఫీకి దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు చేపట్టకుండా విస్మరిస్తే టిడిపి ప్రభుత్వం రూ.553 కోట్లు విచ్చించి పనులు చేపట్టిందని అన్నారు. అందుకు మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ పట్టుబట్టి చంద్రబాబునాయుడు ఒప్పించి నిధులు మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఒకవైపు మంత్రి అప్పలరాజు రిజర్వాయరు పనులు వేగవంతమవుతున్నాయని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో లోడగల కామేష్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, సూరాడ మెహనరావు, ఉమామహేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, మెట్ట రమణ, అవుగాన షణ్ముఖరావు అవుగాన దశరథ పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మురళీమోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళంఅర్బన్

సమతుల్యతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని చిన్న పిల్లల వైద్యాధికారి కె.సోమేశ్వరరావు అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం సెంట్రల్ రోటరీ క్లబ్ అధ్యక్షులు, న్యాయవాది వై.మురళీమోహన్ అధ్యక్షతన నగరంలోని విశాఖ-బి కాలనీలో తల్లి, శిశు ఆరోగ్యపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, పర్యావరణ ప్రభావం అనారోగ్య కారణాలు అవుతున్నాయని అన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ సమతుల ఆహారాన్ని తీసుకుని ఆరోగ్య వంతులుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు కిల్లంశెట్టి దిలీప్, దంత వైద్యులు మధు విలేకర్, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె.టి.నాయుడు, కె.నాగేవ్వరరావు, సెక్రటరీ కె.ఎన్.వి.దుర్గారావు, సభ్యులు కోరాడ వైకుంఠరావు, ఎన్.నరసింహమూర్తి, టి.వాసుదేవరావు, శరత్‌కుమార్, కొంక్యాన మురళీధరరావు పాల్గొన్నారు.

ముగిసిన 'జగనన్న సురక్ష'



మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం రూరల్: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో 28 గ్రామ సచివాలయాల్లో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష ద్విగ్విజయంగా నిర్వహించారని, శనివారంతో ఈ కార్యక్రమం ముగిసిందని ఎంపిపి ప్రతినిధి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి సీతారాం అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారని అన్నారు. గాంధీజీ కళలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు (బుజ్జి), మైలపల్లి కామరాజు, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెదరామునాయుడు, మహంతి సత్యనారాయణ, దన్నాన సత్యంనాయుడు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



శంకుస్థాపన చేస్తున్న తిలక్

నందిగాం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కాలువలు, సిసి రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని కవిటి అగ్రహారంలో రూ.15 లక్షల పంచాయతీ నిధులు, రూ.3 లక్షలు జిల్లా పరిషత్ నిధులతో నిర్మించనున్న కాలువ, సిసి రహదారి పనులకు ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, బొమ్మాళి గున్నయ్యతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారని అన్నారు. అన్ని గ్రామాలకూ కాలువలు, రోడ్డు, ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రోణంకి ధర్మారావు, సర్పంచ్‌లు కణితి నారాయణమూర్తి, రోణంకి బాబూరావు, తమిరి రాజు, అట్టాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టైలర్లకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- బూర్జ

టైలర్లకు ఉచితంగా అందజేసిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కర్నేన దీప అన్నారు. సత్యసాయి సేవా సమితి సంస్థ జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు అధ్యక్షతన మహిళలకు శనివారం ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థ నిరుద్యోగులకు, అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు మాస్టర్, జిల్లా వృత్తి నైపుణ్య అభివృద్ధి ఇన్‌ఛార్జి బోయిన నరసింహమూర్తి, జిల్లా సేవాదళ్ కో-ఆర్డినేటర్లు సూర రామచంద్రరావు, మందలి అమ్మాయమ్మ, జిల్లా సత్యసాయి సంస్థల విస్తరణ ఇన్‌ఛార్జి పడాల ప్రసాద్, ఎంపిడిఒ ఎం.రవీంద్రబాబు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రవికుమార్

ఒఆర్‌ఎస్‌పై అవగాహన

ప్రజాశక్తి- పోలాకి

ప్రపంచ ఒఆర్‌ఎస్ దినోత్సవ సందర్భంగా పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనాథ్ ఆధ్వర్యాన ఒఆర్‌ఎస్‌పై ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ శనివారం అవగాహన కల్పించాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒఆర్‌ఎస్ అనేది అతిసార వ్యాధిగ్రస్తుల పాలిట సంజీవనిలా పనిచేస్తుందని అన్నారు. ఒఆర్‌ఎస్‌లో గ్లూకోజ్, సోడియం, పొటాషియం వంటి లవణాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, పిహెచ్‌ఎన్ ఆరోగ్య పర్యవేక్షకులు శేఖర్‌బాబు, స్టాఫ్‌నర్సులు లక్ష్మి, రమణమ్మ, నాగమణి, సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కృష్ణమూర్తి

రణస్థలం : స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిసిఎంఎస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన గొండు కృష్ణమూర్తి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను కలిశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాద్, వైసిపి నాయకులు జీరు రామారావు, అల్లు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డు పారసాంబలో విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని కౌన్సిలర్ ఎస్.గీత అన్నారు. శనివారం గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కారం లభించడంతో గ్రామస్తులు చైర్మన్ గిరిబాబు, మున్సిపల్ అధికారులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నాయకుల పరామర్శలు

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రహదారుల నిర్వాహణను గాలికి వదిలివేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. ఇటీవల రాజాంలో రహదారి ప్రమాదంలో మృతి చెందిన పొందూరుకు చెందిన గెంబలి రవి, నవ్య కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండడంతో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని, ఆయినా ప్రభుత్వానికి చలనం లేదని అన్నారు. రోడ్ల పరిస్థితిపై పక్క రాష్ట్రంలో మంత్రులు సైతం సెటైర్లు వేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, పి.శ్రీనివాసరావు ఉన్నారు.



లావేరు : పరామర్శిస్తున్న అప్పలనాయుడు

కృపారాణి పరామర్శ

టెక్కలి రూరల్ : మండలంలోని కె.కొత్తూరు వార్డు సభ్యులు రామస్వామి మాతృమూర్తి నీలాపు రాములమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, రామ్మోహనరావు శనివారం రామస్వామిని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మొర్రి శంకర్, ఎంపిటిసి ప్రతినిధి శ్రీనివాస్, భైరాగి, భాస్కరరావు, ప్రసాద్, రమేష్, మాధవరావు పాల్గొన్నారు.

దువ్వాడ వాణి...

సంతబొమ్మాళి : మండలంలోని కాపుగోదాయవలస సర్పంచ్ అంగ లక్ష్మీజనార్థన్, ఎంపిటిసి వాడ్రేవు జగది మామ సింహాచలం కుటుంబానికి, ఉప్పాడపేటకు చెందిన ఉప్పాడ ఢిల్లీశ్వరరావు, భాస్కరరావు కుటుంబాలను నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి శనివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి కాపుగోదయ్యవలస సర్పంచ్ అంగ జనార్థన్ కుటుంబానికి, మేఘవరం వాలంటీర్ పైల కేశవ కుటుంబానికి, రాజపురం వైసిపి నాయకులు బడ్డెపు ఎర్రన్న రెడ్డి కుటుంబాలకు పరామర్శ చేసి తన సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, శ్రీరంగం వీరాస్వామి, అంగ మల్లేష్, సూరాడ జోగారావు, పరపటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



పొందూరు : పరామర్శిస్తున్న రవికుమార్

అప్పలనాయుడు...

లావేరు : మండలంలోని తామాడా పంచాయతీ సూర్యనారాయణపురానికి చెందిన తెలకల కార్పొరేషన్ డైరెక్టర్ యండపల్లి ఈశ్వరరావు సోదరుడు రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు శనివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట వైసిపి యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, ఎచ్చెర్ల సర్పంచ్ టి.లక్ష్మణరావు, ఎంపిటిసి దన్నన ఎల్లయ్య, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, పి.గురునాయుడు మురళి, పోతయ్య ఉన్నారు.



సంతబొమ్మాళి : పరామర్శిస్తున్న వాణి

నేడు నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మణిపూర్ ఘటన ప్రజలను భయకంపితులను చేస్తోందని, ఇటువంటి ఘటనలకు అక్కడి ప్రభుత్వం ప్రోత్సహించేలా వ్యవహరిస్తోందని క్రైస్తవ సంఘాల సమన్వయ కమిటీ నాయకులు డిఎల్‌బిఎల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఎల్‌డబ్ల్యుపిహెచ్ చర్చిలో మణిపూర్ సంఘటనను నిరసిస్తూబ క్రైస్తవ సంఘాల సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు మాట్లాడుతూ మణిపూర్ క్రైస్తవులపై కొనసాగుతున్న దాడులను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ఆదివారం నగరంలో క్రైస్తవుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనలో క్రైస్తవులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని మణిపూర్ బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కిరణ్‌కుమార్, ఎస్‌ఎంయుపిఎఫ్ ప్రెసిడెంట్ జాన్ జీవన్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

'గ్లో' సంస్థ ఆర్థికసాయం

పలాస : మందస మండలం పొత్తంగికు చెందిన బెహర కవిత అనారోగ్యంతో బాధపడుతూ పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్లో సంస్థ ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆదేశాల మేరకు రూ.5 వేలు శనివారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పత్రి లక్ష్మణరావు, కోరాయి సురి, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు ధనుంజయ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలి రూరల్ : టెక్కలి టౌన్-2 ఫీడర్, టెక్కలి టౌన్-4 ఫీడర్, టెక్కలి టౌన్-5 ఫీడర్ల పరిధిలోని విద్యుత్ వైర్లపై ఉన్న చెట్టు కొమ్ములు తొలగిస్తున్నామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.



కళ్యాణం చేస్తున్న అర్చకులు

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. అధిక శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప శర్మ అధ్యక్షతన ఈ కళ్యాణం నిర్వహించారు. ఆలయ సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమా చార్యులు, ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్‌లు పాల్గొన్నారు.



పామును పట్టుకుంటున్న హమంతి

వన్య ప్రాణులను చంపొద్దు

పలాస : వన్యప్రాణులను చంపవద్దని, తమకు సమాచారం అందిస్తే పట్టుకొని సమీప అడవుల్లో విడిచిపెడతామని ఈస్టన్ ఘాట్ వైల్డ్‌లైఫ్ సొసైటీ (ఇజిడబ్ల్యుఎస్) వ్యవస్థాపకుడు కె.మహంతి తెలిపారు. స్థానిక నెహ్రూ నగర్‌లో ఓ ఇంట్లో శనివారం నాగుపాము వెళ్లి ఉండిపోవడంతో కుటుంబ సభ్యులు ఇజిడబ్ల్యుఎస్ నిర్వాహకులు మహంతి బృందానికి సమాచారం అందించారు. వెంటనే వారి బృందం సభ్యులు వచ్చి చాకచక్యంగా పామును బంధించి సమీప అడవిలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మూర్తి మాట్లాడుతూ పాములు సంచరిస్తే తమ బృందానికి సమాచారం అందిస్తే వాటిని పట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలాసకు చెందిన ఓంకార్ త్యాడి, విశాఖపట్నానికి చెందిన రాజు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వార్డు మెంబరు మృతి

బూర్జ : మండలంలోని దొంకలపర్త పంచాయతీ పరిధిలోని హరిపురం, మల్లాపురం గ్రామ వార్డు సభ్యులు నిమ్మక రమణమ్మ (50) శనివారం మృతి చెందారు. ఈమె కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతూ మృతి చెందారు. టిడిపి తరపున పోటీ చేసి గెలుపొందారు. ఆమె మృతిపై పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు సంతాపాన్ని తెలిపారు. జెడ్‌పిటిసి బి.రామారావు, తుడ్డలి సర్పంచ్ అంపిలి గణపతి, జడ్డు కృష్ణులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

రేపు వైద్య శిబిరం

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గుండె, సుగర్, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని అన్నారు. అవసరమైన మేరకు శస్త్ర చికిత్సలు సిఫార్సు చేస్తామని తెలిపారు. నౌపడ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.